# శోభాయమానం


హుస్నాబాద్ పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

హుస్నాబాద్: పట్టణంలో అయోధ్య రామ అక్షింతల శోభాయాత్ర శుక్రవారం కనుల పండువగా సాగింది. గోదామ్ గడ్డ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జై శ్రీరాం నామస్మరణతో నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు దివ్యమైన రామ స్వర్శ అక్షింతలు, అయోధ్య రామమందిర చిత్రం, ఆహ్వాన పత్రం ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు చందుపట్ల నాగరాజు, హిందూ వాహిని అధ్యక్షుడు పన్నీరు భాస్కర్ హాజరయ్యారు. శోభాయాత్రలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు, మండల అధ్యక్షుడు వీరాచారి, ట్రస్ట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం'

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించడమే ఏకైక మార్గమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద శక్తులను ఓడించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక సామాజిక శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుగ్గిల్లలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎక్కడా వివక్ష లేకుండా పారదర్శకంగా అర్హులందరికీ పథకాలు అందుతాయని తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు, రుణమాఫీ తదితర పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాము, ఏపీఓ నర్సయ్య, సర్పంచ్ సీతాలక్ష్మి, ఎంపీటీసీ మల్లేశం, దామోదర్, భూమయ్య, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్, తిరుపతి, రవి, డీవీరావు పాల్గొన్నారు.

### అద్దె బస్సు యజమానులను ఆదుకోండి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

హుస్నాబాద్: అద్దె బస్సు యజమానులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని హుస్నాబాద్ అద్దె బస్సు ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డగుంట మొగిలి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం డిపో మేనేజర్ వెంకటేశ్వర్లకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడంతో కెపాసిటికి మించి బస్సుల్లో ప్రయాణికులు ఎక్కడం వల్ల టైర్లు పంచారు కావడంతో పాటు ఏఎంపీఎల్ కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, కోశాధికారి దొడ్ల అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

సిద్దిపేటకమాన్: రాష్ట్ర నేషనల్ హెల్త్ మిషన్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సిద్దిపేటలో శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజు, గౌరవ అధ్యక్షుడుగా ప్రీతమ్, సలహాదారులుగా అనిల్‌రాజా, నాగరాజు, రాఘవేంద్ర, ఉపాధ్యక్షులుగా శ్రీలత, రాము, జాయింట్ సెక్రటరీగా గోపాల్, మీడియా పబ్లిసిటి వినయ్, కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్, శంకర్, అంబిక, సౌందర్య, సచిన్ ఎన్నికయ్యారు.

### రామమందిర నిర్మాణం చారిత్రాత్మకం


అయోధ్య ట్రస్ట్‌కు లిఖిత రామనామాలను అందజేస్తున్న రామరాజు

గజ్వేల్‌రూరల్: అయోధ్యలో రామ మందిర నిర్మాణం చారిత్రాత్మకమని అయోధ్య ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు అన్నారు. పట్టణంలోని మురళీకృష్ణాలయంలో శుక్రవారం అయోధ్య ట్రస్ట్‌కు రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో భక్తులు లిఖించిన కోటి 16 లక్షల రామనామాలను ప్రత్యేక పూజలు నిర్వహించి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 ఏళ్ల నాటి కల నెరవేరే సమయం ఆసన్నమైందని.. గజ్వేల్ నుంచి రామనామాలు అయోధ్యకు చేరడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ఈసందర్భంగా రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజును అభినందించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

### గట్లమల్యాలకు చేరుకున్న అక్షింతలు

నంగునూరు(సిద్దిపేట): శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు శుక్రవారం గట్లమల్యాలకు చేరుకున్నాయి. ట్రస్ట్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. అనంతరం అక్షింతలకు హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

### 'కాంగ్రెస్‌వి మాయమాటలు'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ నాయకులు ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్వాల్ యాద నరేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను పరిహాసం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన దరఖాస్తు ఫారంలో ఉద్యమకారులని ఎఫ్ఐఆర్ నంబర్ అడగడం విడ్డూరంగ ఉందని వాపోయారు. నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి


మాట్లాడుతున్న వివేక్ వర్ధన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీస్‌లను అందుబాటులో ఉంచాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వివేక్ వర్ధన్ కోరారు. ఏబీవీపీ సిద్దిపేట శాఖ అధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల విద్యార్థులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బస్సులు సమయానికి రాక కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ చరణ్, టెక్నికల్ కన్వీనర్ సాకేత్, నగర సంయుక్త కార్యదర్శి హరీశ్, పరశురాం, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సెయింట్ జాన్స్ హైస్కూల్ కరస్పాండెంట్ సెల్వరాజ్, ప్రిన్సిపాల్ రిచల్ అనితసుధీర్ అన్నారు. సిద్దిపేట ఇంటర్‌స్కూల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం సాధించడంతో శుక్రవారం పాఠశాల యాజమాన్యం విద్యార్థులను సన్మానించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ఇంటర్ స్కూల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సెయింట్ జాన్స్ హైస్కూల్ ప్రథమ స్థానంలో నిలవడం పాఠశాలకు గర్వకారణం అన్నారు.

## దరఖాస్తుల కొరత తీర్చండి


చౌటపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీపీఓ దేవకీ దేవి

అక్కన్నపేట(హుస్నాబాద్): దరఖాస్తుల కొరత తీర్చాలని కాంగ్రెస్ నాయకులు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సర్పంచ్‌లు ముత్యాల సంజీవ్‌రెడ్డి, బద్దం రాజిరెడ్డి శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) దేవకీదేవి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని చౌటపల్లి, జనగామ గ్రామాల్లో ఆమె ప్రజాపాలన కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఒకరోజు ముందుగానే దరఖాస్తులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్‌కార్డులు లేని వారి నుంచి అధికారులు తెల్ల కాగితాలపై వినతిపత్రాలను స్వీకరిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీఓ కవికుమార్, సర్పంచ్ గద్దల రమేష్, నోడల్ ఆఫీసర్ రంగానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మాలోతు భీలునాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరేడ్‌కు ఎంపిక కావడం హర్షణీయం



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: జనవరి 26వ తేదీన ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో డప్పు నృత్యం ప్రదర్శించే అవకాశం రావడం విద్యార్థులకు రావడం హర్షనీయమని సిద్దిపేట డిగ్రీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతున్న విద్యార్థినులు దివ్య, జాగతి, సౌమ్య జనవరిలో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక కాగా శుక్రవారం కళాశాలలో వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రద్ధానందం, కృష్ణయ్య, మధుసూదన్, డాక్టర్ పల్లవి, డాక్టర్ వాసం శ్రీనివాస్, డాక్టర్ రాణి, అధ్యాపకులు శ్యాం సుందర్, డాక్టర్ సుజాత, డాక్టర్ మహేందర్, గురుమూర్తి, డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


నాగరాజు మృతదేహం

సిద్దిపేటఅర్బన్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనక నుంచి కారు ఢీకొట్టడంతో కింద పడగా అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈసంఘటన సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాలు.. సిద్దిపేట పట్టణం అంబేడ్కర్ నగర్‌కు చెందిన కొండం నాగరాజు (28) పొన్నాల గాంధీనగర్ వద్ద రోడ్డు పక్కన వైన్స్ పర్మిట్ రూంలో మద్యం తాగి బయటకు వచ్చి తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. వెనకనుంచి కారు ఢీకొనగా రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న లారీ అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై ఇంకా ఫిర్యాదు రాలేదని, ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

## తెరపైకి కొత్త మండలాలు

### మంత్రి పొన్నం హామీతో జోరుగా చర్చ

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గంలో కొత్తగా మూడు మండలాల ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది. హుస్నాబాద్ నియోజకవర్గం ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలో విస్తరించింది. హుస్నాబాద్ టౌన్‌తో పాటు హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలు, వేలేరు (రెండు గ్రామాలు) సిద్దిపేట జిల్లాలో, చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు కరీంనగర్‌లో, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలు హన్మకొండ పరిధిలో ఉన్నాయి. ఇప్పటికే సిద్దిపేట జిల్లాలోనే అతి పెద్ద నియోజకవర్గంగా హుస్నాబాద్ అవతరించింది. జిల్లాల పునర్విభజన తర్వాత హుస్నాబాద్ మండలంలో మరో మండలంగా అక్కన్నపేటను ఏర్పాటు చేశారు.

#### పెద్ద మండలముగా అక్కన్నపేట..

హుస్నాబాద్ నియోజకవర్గంలోనే 32 గ్రామ పంచాయతీలతో అక్కన్నపేట అతి పెద్ద మండలముగా రూపుదిద్దుకుంది. అలాగే కొత్త జీపీలుగా దుబ్బతండా పరిధిలోని (దాస్‌తండా), అక్కన్నపేట గ్రామ పరిధిలోని (చౌడ్‌తండా), గండిపల్లి గ్రామ పరిధిలోని (సరిరాంతండా), (అంబనాయక్ తండా), కుందనవాని పల్లి గ్రామ పరిధిలో (చౌటకుంట తండా), రామవరం గ్రామ పరిధిలోని (బంగారులొద్ది తండా) తండాలు జీపీలుగా ఏర్పాటుకు అన్ని అర్హతలు, సౌకర్యాలు ఉన్నాయని అధికారులు నివేదికలు పంపారు. ఈ ఆరు జీపీలకు కొత్త ప్రభుత్వం ఆమోదం తెలిపితే మొత్తంగా అక్కన్నపేట మండలంలో 38 గ్రామ పంచాయతీలుగా ఉంటాయి. మండల కేంద్రానికి వెళ్లాలంటే దూరభారంతో ఆర్థిక భారం పడుతుందని, మరో మండలం ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది. అక్కన్నపేట మండలంలో కొనసాగుతున్న గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వు తండా, గౌరవెల్లి, బొడిగెపల్లి, జనగామ, గుబ్బడి, కేశవాపూర్, మంచినీళ్ల గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తూ గత ప్రభుత్వంలో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ తుది నోటిఫికేషన్ విడుదల కాలేదు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తారా, లేదంటే అక్కన్నపేట మండలంలోనే కొనసాగిస్తారా..? లేదా హుస్నాబాద్ రూరల్ మండలం ఏర్పాటు చేస్తారా అనేది కొత్త ప్రభుత్వం నిర్ణయంపై ఆధారపడి ఉంది.


హుస్నాబాద్ నియోజకవర్గ మ్యాప్

#### చిగురిస్తున్న ఆశలు..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే పరిపాలన సౌలభ్యం కోసం నియోజకవర్గంలో కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేస్తామని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంత్రి హామీ మేరకు హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి, భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ, ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్‌ను మండలాలుగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల హుస్నాబాద్‌లో జరిగిన ప్రజా పాలన కార్యక్రమ అవగాహన కార్యక్రమంలో కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్త మూడు మండలాల ప్రస్తావన తెచ్చారు. దీంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

## కొనసాగుతున్న 'ప్రజాపాలన'


దుద్దెడలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

సిద్దిపేటరూరల్/చేర్యాల(సిద్దిపేట)/నంగునూరు/చిన్నకోడూరు/దుబ్బాకరూరల్/కొండపాక/మద్దూరు(హుస్నాబాద్): ప్రజాపాలన ఐదు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చేర్యాల మండల పరిధిలోని నాగపురి, శభాష్ గూడెం, గుర్జకుంట, దొమ్మాట గ్రామాలతో పాటు పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో దరఖాస్తులను అధికారులతో కలిసి ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి స్వీకరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎంపీడీఓ మహబూబ్‌అలీ, మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. నంగునూరు మండలంలోని గట్లమల్యాల, కొండంరాజ్‌పల్లి, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షురాలు రేణుక, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని రంగాయపల్లి, గంగాపూర్, సికింద్లాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సిద్దిపేట ఆర్డీఓ రమేష్ బాబు, జెడ్పీ సీఈఓ రమేష్ సందర్శించారు. దుబ్బాక మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట మండల పరిధిలోని చింతమడక, మాచాపూర్, ఇర్కోడ్, వెంకటాపూర్ గ్రామాల్లో ఎంపీడీఓ కుమారస్వామి, ఎమ్మార్వో సలీం అధ్వర్యంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కొండపాక మండల పరిధిలోని దుద్దెడ, బందారం గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ పరిశీలించారు. మద్దూరు మండలంలోని నర్సాయపల్లి, గాగ్గిలాపూర్, వల్లంపట్ల, వంగపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు కొనసాగాయి. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి సూచించారు.


చేర్యాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి


నంగునూరు: గట్లమల్యాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

## సంక్షిప్త వార్తలు

◆ **నేడు బైరాన్‌పల్లికి ఎమ్మెల్యే 'పల్లా'రాక**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లిలో శనివారం నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ దూల్మిట్ట మండలాధ్యక్షుడు మంద యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **భూమి పూజ**



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి గ్రామ శివారు కొండపోచమ్మ ఆలయ సమీపంలో చేపడుతున్న నల్లపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాన్ని దేవాలయ నిధులతో పాటు దాతల సహకారంతో నిర్మాణ పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు, కరుణాకర్, నర్సింహులు, సత్యనారాయణ, వెంకట్, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి**

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రాంసాగర్‌లో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనియర్ కళాశాల లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించిన పట్టించుకోలేదని వాపోయారు. కార్యక్రమంలో చరణ్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల పంపిణీ**

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బూర్గుపల్లిలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, సభ్యులు ఎల్లంరాజు, అజయ్, నాగేందర్, అర్జున్, శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **ఎమ్మెల్యేకు వినతి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల శివారులో ఎన్‌టీసీ ఇచ్చిన ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వొద్దని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణకు శుక్రవారం గుగ్గిల్లలో ఎంపీటీసీ మల్లేశం వినతిపత్రం అందజేశారు.

◆ **నూతన నియామకం**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి కల్లు గీత కార్మిక సొసైటీ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మార్క చంద్రయ్య గౌడ్ ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా రంగు తిరుపతి, డైరెక్టర్లుగా మార్క రాజమౌళి, చెప్యాల మల్లయ్య, బత్తిని ఎల్లయ్య, రంగు రాజయ్య ఎన్నికైనట్లు గీతా కార్మికులు తెలిపారు.

◆ **దుప్పట్ల పంపిణీ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పనుల కోసం వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులకు అలయన్స్ మిత్ర క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అలయన్స్ మిత్ర క్లబ్ గౌరవ అధ్యక్షుడు గందె ఈశ్వర్ చరణ్ ఆర్థిక సహాయంతో 35 మంది వలస కార్మిక కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ కార్యదర్శి గంశెట్టి కైలాసం, కోశాధికారి ఏలూరు ప్రభాకర్, జిల్లా గవర్నర్ సోమ వనజ, ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మ రాములు, తదితరులు పాల్గొన్నారు.

◆ **పాఠశాలకు మైక్‌సెట్ అందజేత**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1990- 91 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం రూ. 25 వేల విలువ కలిగిన మైక్ సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ర్యాకం మల్లేశం, ఎండీ. అహ్మద్, రాందేవ్ చంద్రశేఖర్, సత్తు రాజిరెడ్డి, గున్నాల ముత్యం పాల్గొన్నారు.

◆ **రేపు అయ్యప్ప స్వాముల శోభాయాత్ర**

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలో ఈనెల 31వ తేదీన పల్లీవేట పంబాఆరట్టు, అంబారిపై స్వామివారి ఊరేగింపు, శోభాయాత్ర నిర్వహించనున్నట్లు అయ్యప్ప స్వాములు తెలిపారు. ఈమేరకు ర్యాలీకి అనుమతి కోరుతూ అయ్యప్ప స్వాములు పట్టణంలోని వన్‌టౌన్ పోలీసులను సంప్రదించారు. పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం నుంచి కోమటిచెరువు వరకు శోభాయాత్ర ఉంటుందని తెలిపారు.